నవతెలంగాణ 1
ఆదిలాబాద్
శనివారం | సెప్టెంబర్ 02, 2023 | www.navatelangana.com

అడెల్లి ఆలయ దుకాణాల సముదాయానికి వేలం

సారంగాపూర్ : మండలంలోని అడెల్లి శ్రీమహా పోచమ్మ దేవస్థానంలో సంవత్సరం పాటు వివిధ రకాల వస్తువులు విక్రయించేందుకు లీజు హక్కు కోసం బహిరంగ వేలం శుక్రవారం నిర్వహించారు. వేలంపాటలో కొబ్బరికాయలు అమ్ముకునే హక్కును జామ్ గ్రామానికి చెందిన సత్యనారాయణ రూ.17లక్షల65వేలకు దక్కించుకున్నారు. గత సంవత్సరం కంటే రూ.10వేలు అదనంగా ఆలయానికి ఆదాయం చేకూరినట్టు ఆలయ ఛైర్మెన్ అయిటి చందు తెలిపారు. ఈ వేలం పాటకు దేవాదాయ శాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్ పర్యవేక్షించారు. మిగతా టెండర్‌లు వాయిదా వేశామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు పురుషోత్తంరావు, దేవాయి, గజానన్‌రావు, రాజు, మార్కెట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణగౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు శేఖర్‌గౌడ్, రాకేష్‌రావు, ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, సిబ్బంది, వ్యాపారస్తులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు పీఆర్‌టీయూ వినతి

నవతెలంగాణ-తాండూర్

సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా పిఆర్‌టియుటిఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో పాత పెన్షన్ పునరుద్ధరించాలని మండల రెవెన్యూ అధికారి డి.రోహిత్‌కు వినతిపత్రం అందజేశారు. సెప్టెంబర్ 1,2004 నుండి అమలవుతున్న నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో పిఆర్‌టియుటిఎస్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి బత్తుల రవీందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బాలాజీ ప్రసాద్, కుమార్, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



బీర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలపై తిరగబడదాం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జు



నవతెలంగాణ-ఉట్నూర్

బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు తోడుదొంగలేనని, ఆ ప్రభుత్వాలపై తిరగబడదామని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జు, జెడ్పీటీసీ చారులత పార్టీ శ్రేణులకు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్ట్ కార్డులను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9ఏళ్ల పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను అన్ని రకాలుగా మోసం చేశాయన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ చేస్తున్న అక్రమాలపై కాంగ్రెస్ తరపున ప్రజా చార్జిషీట్ వేస్తామన్నారు. ప్రభుత్వాలు ఇచ్చిన ఏ ఒక్క హామీలను కూడా నెరవేర్చలేదన్నారు. ఈ రెండు పార్టీలు దేశాన్ని, రాష్ట్రాన్ని దోచుకుంటున్నాయని ఆరోపించారు. రాబోయే రోజులలో ప్రజలే తగిన గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అబ్దుల్ ఖయ్యుం, నాయకులు ఉన్నారు.

ఢిల్లీలో నిర్మించే వాటికకు మట్టి సేకరణ



నవతెలంగాణ-ఉట్నూర్

దేశానికి స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆజాదీకా అమత్ మహోత్సవం కార్యక్రమం సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు ఢిల్లీలో ఇండియా గేట్ పక్కన అమత్ వాటిక నిర్మాణం కోసం దేశంలోని ప్రతి గ్రామం నుండి మట్టి సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా మండలంలో కలశాన్ని తయారు చేసి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఖానాపూర్ అసెంబ్లీ నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు రాథోడ్ రమేష్ జాతీయ జెండాను చేత పట్టుకొని ఇంటింటికి వెళ్లి మట్టిని సేకరించారు. ఈ మట్టిని ఢిల్లీలో నిర్మించే అమరవీరుల పేరు మీద నిర్మించబడే అమత వాటికకు ఉపయోగించడం జరుగుతుందని రాథోడ్ రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కోఆర్డినేటర్ కొమ్ము రామ్‌చందర్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్, జిల్లా నాయకులు భాగ్యలక్ష్మీ, జిల్లా కార్యదర్శి బొడ్డు కిరణ్, నాయకులు లింగాగౌడ్, దేవిదాస్, రాజేశ్వర్, రవి, రవీందర్, జగన్, వెంకటేష్, శ్రీనివాస్, రవి ఉన్నారు.

మండల కమిటీల పునర్ వ్యవస్థీకరణ



ఉట్నూర్ : జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండలాల్లో కమిటీలను పునర్ వ్యవస్థీకరణ చేస్తున్నట్లు జై ఆదివాసీ యువశక్తి జిల్లా అధ్యక్షుడు పెందూరు రాజేశ్వర్ తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసి ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తామని అన్నారు. జనవరిలోగా అన్ని మండల కమిటీలను ఖరారు చేస్తామన్నారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉట్నూర్ జై ఆదివాసి యువశక్తి మండల కమిటీ అధ్యక్షులుగా ఆత్రం ప్రకాష్, ఉపాధ్యక్షులుగా మడావి బాలాజీ, ప్రధాన కార్యదర్శిగా అరక విజయ్, సంయుక్త కార్యదర్శిగా మెస్రం జగన్, కార్యదర్శులుగా టేకం బాబూరావు, అంకుశ్, సునీల్, కిరణ్, ముకుందలను ఎన్నుకొగా వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సవరించుకోవాలి

సిర్పూర్(టి) : ఓటరు జాబితాలో తమ పేర్లను, చిరునామా, మార్పులు చేర్పులను సవరించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ బి.లలిత శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితాలో చిరునామా, తమ వివరాలను సవరించుకోవాలని సూచించారు. శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటర్ల దినోత్సవం ఉందని, రెండు రోజుల్లో బూత్‌స్థాయి అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ బూత్ కేంద్రాల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు హాజరై ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. శనివారం పోలింగ్ కేంద్రంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి గ్రామస్తులతో గ్రామసభ నిర్వహిస్తారన్నారు. ఫారం-6, 8 ద్వారా బీఎల్‌వోలు సేకరిస్తారన్నారు.

దారి లేదు..గమ్యం చేరరాదు..!

- ఏండ్లుగా రోడ్డు సౌకర్యానికి నోచుకోని గ్రామాలు
- చాలా చోట్ల వంతెనలు లేక..వాగులు దాటలేక అవస్థలు
- అత్యవసర సమయంలో ఎడ్లబండ్లు..కాలినడకే దిక్కు
- అటవీ అనుమతులు లేక కొన్ని..మంజూరుకాక మరికొన్ని
- ఏజెన్సీ ప్రాంతంలో అనేక గ్రామాల నరకయాతన

పూర్వపు కాలంలో రవాణ సౌకర్యం లేక పల్లెవాసులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి కాలినడకన వెళ్లేవారు. సుదూర ప్రాంతాలకు ఎడ్లబండ్లను ఆశ్రయించేవారు. స్వాతంత్ర్యం వచ్చి 75ఏండ్లు గడిచినా పల్లెల స్థితిగతుల్లో పూర్తిగా మార్పులు రావడం లేదు. ఆనాటి పరిస్థితులు ఇప్పుడూ కనిపిస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అత్యధికంగా అటవీ ప్రాంతం విస్తరించి ఉండటం.. వాగులు, వంకలు అనేకం ఉండటంతో చాలా పల్లెలకు రోడ్లు, వాగులపై వంతెనల సౌకర్యం లేకుండా పోయింది. ప్రతి ఏటా వర్షాకాలం వచ్చిందంటే అనేక పల్లె వాసులు వాగులు దాటేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. ప్రమాదకరంగా వాగులు దాటే క్రమంలో ప్రాణాలు కోల్పోతున్నాయి. రోడ్డు సౌకర్యం కూడా లేని కారణంగా అత్యవసర సమయాల్లో సకాలంలో ఆస్పత్రులకు వెళ్లలేక మార్గమధ్యలోనే చనిపోతున్న సందర్భాలు చోటుచేసుకుంటున్నాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత రోడ్ల నిర్మాణానికి పెద్దపీఠ వేసినా.. ఉమ్మడి జిల్లాలో పూర్తిగా కార్యరూపం దాల్చడం లేదు. ఫలితంగా జనం రవాణ సౌకర్యం లేక నరకయాతన అనుభవిస్తున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చాలా ప్రాంతాల్లో రోడ్డు సౌకర్యం అందుబాటులోకి రావడం లేదు. ఏండ్లు గడుస్తున్నా మార్గం సులభం కావడం లేదు. ఫలితంగా ఇప్పటికీ అనేక పల్లెవాసులు మండల కేంద్రానికి వెళ్లాలంటే కాలిబాటనే ఆశ్రయిస్తున్నారు. వాగులు, వంకలు దాటేందుకు సాహసం చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా వర్షాకాలం వచ్చిందంటే గ్రామాలకు వెళ్లే మట్టిరోడ్లు బురదమయంగా మారడం.. కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని పరిస్థితి ఉండటం వంటి సమస్యల కారణంగా ఊరు విడిచి బయటకు వెళ్లలేకపోతున్నారు. ఆపద సమయంలో ఆస్పత్రికి వెళ్లాలంటే ఎడ్లబండ్ల ద్వారా వాగులు, వంకలు దాటి.. మైదాన ప్రాంతానికి చేరుకుంటున్నారు. అక్కడి నుంచి అంబులెన్సులు, ఇతరాత్ర వాహనాల ద్వారా ఆసుపత్రికి చేరుకుంటున్నారు. ఆలోపు పరిస్థితి విషమిస్తే ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలున్నాయి. ఇటీవల ఐటీడీఏ పరిధిలో రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.300కోట్లు మంజూరుచేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ ప్రకటించారు. కానీ నిధులు విడుదల కాకపోవడంతో కొత్త రోడ్లు, వంతెనల నిర్మాణానికి మోక్షం లభించడం లేదు.



బజార్‌హత్నూర్ మండలం గిరిగామలో వాగు దాటుతున్న మహిళలు

అటవీ అనుమతులు లేక అవస్థలు..!

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి అటవీ అనుమతులు అడ్డంకిగా మారుతున్నాయి. మారుమూల ప్రాంతాల్లో అడవుల మధ్య నుంచి రోడ్డు వేయాలంటే ముందుగా అటవీశాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అటవీ పరిరక్షణ దృష్ట్యా ఆ శాఖ అనుమతులు మంజూరు చేయడంలో తాత్సారం చేస్తోంది. ఫలితంగా ఇప్పటికీ అనేక పల్లెలు రోడ్డు సౌకర్యానికి నోచుకోవడం లేదు. కొన్ని చోట్ల రోడ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు అటవీ అనుమతుల కోసం ప్రతిపాదనలు పంపించారు. కానీ అక్కడ్నుంచి త్వరగా అనుమతి రాకపోవడం మూలంగా నిర్మాణాల్లో ఏండ్ల తరబడి జాప్యం జరుగుతోందనే వాదనలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారుమూల ప్రాంతాల మధ్య రవాణా మార్గం సులభతరం చేసేందుకు అటవీ మార్గాల్లో రోడ్లు, వంతెనలు వంటి నిర్మాణాలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



అటవీ శాఖ అనుమతులు లేక ఆగిన రోడ్డు పనులు



నిర్మల్ జిల్లా పెంబి మండల పసుపుల గ్రామం వద్ద వాగుపై చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణం ఇది. గత కొన్నేండ్ల నుంచి పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో అంకెన, రాయదారి, పోచంపల్లి, కర్ణంలొద్ది, గట్టిగూడెం, హరిచంద్‌తాండ, కొరకంటి గ్రామాల ప్రజలు పెంబి మండల కేంద్రానికి వెళ్లలేని పరిస్థితి. ఏదైనా పని నిమిత్తం బయటకు వెళ్లాలంటే ఈ వాగు దాటి వెళ్లాల్సి ఉంటుంది. ఇటీవల గ్రామానికి చెందిన గర్భిణీ పురిటి నొప్పులు అధికం కావడంతో బంధువులు, గ్రామస్తులు ఎడ్లబండిపై వాగు దాటించి ఒడ్డున అంబులెన్స్ కోసం వేచిచూశారు. అంబులెన్స్ వచ్చేలోపు సదరు మహిళ బిడ్డకు జన్మనిచ్చింది. ఇలాంటి పరిస్థితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక చోట్ల కనిపిస్తోంది.

ముగిసిన గడువు..దరఖాస్తులు కరువు

- నవోదయలో ప్రవేశానికి గతేడాది కంటే 25 శాతం తగ్గిన దరఖాస్తులు
- 2024 జనవరి, 20న ప్రవేశపరీక్ష

2024-25 విద్యాసంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు గడువు గురువారం అర్ధ రాత్రితో ముగిసింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది ముందస్తుగానే ప్రవేశపరీక్ష నోటిఫికేషన్ వెలువరించడం, దరఖాస్తుల స్వీకరణ చేపట్టడంతో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన లేక దరఖాస్తు చేసుకోలేదని తెలుస్తోంది. పైగా అన్ని కొత్త జిల్లాలలో గురుకులాల సంఖ్య పెరగడం కూడా దరఖాస్తుల సంఖ్య తగ్గడానికి ఒక కారణమని చెప్పవచ్చు.



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రతి ఏటా నవోదయ విద్యాలయ సమితి ఆరో తరగతిలో ప్రవేశానికి విద్యాసంవత్సరం చివరలో నోటిఫికేషన్ జారీ చేసి, ఏప్రిల్, మే, జూన్ నెలలలో ప్రవేశపరీక్ష నిర్వహిస్తుంది. కాని 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశం కోసం 2023 ప్రారంభంలోనే నోటిఫికేషన్ జారీ చేసింది. 2024, జనవరి 20వ తేదీన నిర్వహించే ప్రవేశపరీక్ష కోసం 2023, జులై నెలలోనే దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. ముందు నిర్ణయించిన ప్రకారం ఆగష్టు పదో తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ కాగా అప్పటి వరకు తక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో దీనిని ఆగష్టు 25 వరకు, తర్వాత ఆగష్టు 31 వరకు పెంచుతూ వచ్చారు. ఆగష్టు 31 అర్ధరాత్రి వరకు ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తుల సంఖ్య కేవలం 4,458 మాత్రమే. గతేడాది 5,920 దరఖాస్తులు వచ్చాయి. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం 25 శాతం వరకు దరఖాస్తులు తగ్గాయి.

ఏటేటా తగ్గుతున్న దరఖాస్తులు

కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశానికి ఏటేటా దరఖాస్తుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఒకప్పుడు దక్షిణ భారతదేశ స్థాయిలోనే అత్యధిక దరఖాస్తులతో కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయం ముందంజలో ఉండేది, కాని ఆన్‌లైన్ విధానం ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించిన సంవత్సరం నుండి దరఖాస్తుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. 2018-19 విద్యాసంవత్సరం నుండి ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టగా తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. దీనితో ఆ ఒక్క ఏడాది ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రెండు విధాలుగా దరఖాస్తులు స్వీకరించడంతో ఆ ఏడాది 12,421 దరఖాస్తులు వచ్చాయి. 2019-20 నుండి పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఆ ఏడాది 8,133, 2020-21లో 5.042 దరఖాస్తులు, 2021-22లో 2,972 (కరోనా కాలం) దరఖాస్తులు, 2022-23లో 6,147 దరఖాస్తులు, 2023-24లో 5,920 దరఖాస్తులు వచ్చాయి. 2024-25కు వచ్చేసరికి ఈ సంఖ్య 4,458కి పడిపోయింది.

కొత్త జిల్లాల వారీగా గతేడాది, ఈ ఏడాది వచ్చిన దరఖాస్తుల వివరాలు

జిల్లా	2023-24	2024-25
ఆదిలాబాద్	1,378	983
నిర్మల్	1,589	1,208
మంచిర్యాల	1,526	1,188
ఆసిఫాబాద్	1,427	1,079
మొత్తం	5,920	4,458

గురుకులాల ప్రభావమే కారణం : బి చక్రపాణి, ప్రిన్సిపాల్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గురుకులాల సంఖ్య పెరగడమే జవహర్ నవోదయ విద్యాలయంలో అధిక సంఖ్యలో దరఖాస్తులు రాకపోవడానికి కారణం. గురుకులాలలో ఐదో తరగతిలో చేరిన విద్యార్థి అందులో కొనసాగడానికే ఆసక్తి చూపుతున్న కారణంగా నవోదయకు దరఖాస్తు చేసుకోవడం లేదు. అంతేకాకుండా గతంలో నవోదయలో అర్బన్ కేటగిరీ ప్రత్యేకంగా ఉండేది. ఇపుడు ఆ విధానం తీసివేయడంతో రూరల్ విద్యార్థులు కూడా అర్బన్‌లో పోటీ పడుతున్నారు. దీనితో అర్బన్ విద్యార్థులకు సీటు వచ్చే అవకాశాలు సన్నగిల్లాయి. ఈ ఏడాది ముందస్తుగానే నోటిఫికేషన్ రావడం కూడా ఒక కారణమని చెప్పవచ్చు.



అంగన్‌వాడీ ఉగ్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

నవతెలంగాణ - దహెగాం

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కవితకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రాజెక్టు కోశాధికారి వజ్రమ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 70వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. 40 సంవత్సరాలుగా సేవలందిస్తున్న వారికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగభద్రత, ప్రమాదబీమా సౌకర్యాలు కల్పించలేదన్నారు. అర్హులైన ఆయాలను టీచర్లుగా ప్రమోట్ చేయాలని, అద్దె భవనాలకు సొంత భవనాలు నిర్మించాలని, పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో సంబంధిత శాఖ మంత్రి ఇచ్చిన హామీలు కూడా నేటికి నెరవేర్చలేదన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని తదితర డిమాండ్లతో ఈ నెల 11 నుండి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మల్లీశ్వరి, కళావతి, కమల, రమాదేవి, విజయ, సుగుణ, విమల పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



నవ తెలంగాణ - బోథ్

ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ పథకంలో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని భవన నిర్మాణ పెయింటర్స్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేణిగుంట సురేష్ అన్నారు. మండల కేంద్రంలో మార్కెట్ యార్డ్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మహాసభలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అలాగే భవన నిర్మాణ పెయింటర్స్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ అభివద్ధి పథకాలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్లలో ప్రతి ఒక్కరు ఐడి కార్డ్, లేబర్ కార్డు, ఆయుష్మాన్ భారత్‌లో వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ పెయింటర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు వై ఆశన్న, మండల అధ్యక్షుడు రేడపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సర్పరాజ్, నాయకులు అనిల్, శేఖర్, మానాల గోపాల్, శ్రీకాంత్, సభ్యులు పాల్గొన్నారు.

మందమర్రి ఏరియాలో 82శాతం బొగ్గు ఉత్పత్తి

నవతెలంగాణ-మందమర్రి



మందమర్రి ఏరియాలో ఆగస్టు నెలలో 82శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు ఏరియా జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ తెలిపారు. శుక్రవారం మందమర్రి జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్పత్తి ఉత్పాదకత వివరాలు జీఎం మనోహర్ వివరిస్తూ ఆగస్టు నెలలో 82శాతం ఉత్పత్తి సాధించామని, గడిచిన జులై మాసంతో పోలిస్తే 22వేల టన్నులు అధికంగా ఉత్పత్తి జరిగిందన్నారు. ఆగస్టు నెలలో కెకె5 గని 103శాతం, ఆర్కే ఓసి 132శాతం, కాసిపేట 62శాతం, కాసిపేట 2- 36శాతం, శాంతిఖని 47శాతం, కెకెఓసి 61శాతం బొగ్గు ఉత్పత్తి జరిగిందని తెలిపారు. ఏరియా మొత్తంగా 2.44 లక్షల టన్నులు సాధించామని తెలిపారు. ఆర్కే ఓసి, కెకె ఓసి ద్వారా ఆగస్టులో 32.06 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వెలికి తీశామని తెలిపారు. 100 శాతం పైన ఉత్పత్తి సాధించినందుకు కెకె5, ఆర్కే ఓసి అధికారులను ఉద్యోగులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. తమకు నిర్దేశించిన ఇతర గనులు కూడా లక్ష్యాలను సాధించి ఏరియాను ప్రగతి పథంలో నిలిచేలా కృషి చేయాలని జీఎం కోరారు.

రెండు రోజులు రైల్వేగేటు మూసివేత

సిర్పూర్(టి) : కాగజ్‌నగర్, సిర్పూర్ ప్రధాన రోడ్డు మార్గంలో ఉన్న రైల్వేగేటు మరమ్మత్తు పనులు జరుగుతున్నట్టు రైల్వేశాఖ అధికారులు సూచనల మేరకు రెండు రోజుల పాటు మూసివేస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ బి.లలిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం..వేంపల్లి రైల్వేగేటు వద్ద క్రాసింగ్ లెవల్ పనులు జరుగుతున్నందున ఈ నెల 4న ఉదయం ఆరు గంటల నుండి 5న రాత్రి 11 గంటల వరకు సిర్పూర్ నుండి కాగజ్‌నగర్‌కు వెళ్లే మార్గంలో రైల్వేగేటు మూసివేయనున్నట్టు, ప్రయాణికులు గమనించి సహకరించాలని కోరారు.

నవతెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | సెప్టెంబర్ 02, 2023 | www.navatelangana.com

న్యాయవాదుల విధుల బహిష్కరణ

నవతెలంగాణ-ఖానాపూర్

యూపీ రాష్ట్రంలో జరిగిన న్యాయవాదులపై దాడికి నిరసనగా శుక్రవారం ఖానాపూర్ న్యాయవాదులు విధులను బహిష్కరించారు. కోర్టు విధులని దేశ వ్యాప్తంగా బహిష్కరించాలనే సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం



ఖానాపూర్ కోర్టు బయట నిరసన తెలియజేశారు. న్యాయవాదులపై దాడులు చేయడం హేయమైన చర్యని ఇందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు మంత్రరాజ్యం సురేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వెంకట మహేంద్ర, షబ్బీర్ పాషా, బాషెట్టి శివ ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

నవతెలంగాణ-తలమడుగు

ఆటో బోల్తా పడ్డ ఘటనలో మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన సుదారపు రేణుక(60) తీవ్రగాయాలై రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు ఈ నెల 24న రుయ్యాడి గ్రామం నుంచి టీఎస్-17టి 7469 నెంబర్ గల ఆటోలో మహారాష్ట్రలోని మహోర్ రేణుక మాత దర్శనానికి వెళ్తుండగా ఉండం గ్రామం సమీపాన ఆటో అతివేగంతో అజాగ్రత్తగా డ్రైవర్ సునీల్ ఆటో నడపడంతో ప్రమాదం జరిగినట్టు తెలిపారు. మృతురాలు రేణుకతో పాటు ఆమె భర్త వెంకన్న ఇతర ప్రయాణికులు కూడా తీవ్ర గాయాలు కాగా, వెంటనే అదే ఆటోలో జిల్లా రిమ్స్‌కు తరలించారు. కాగా మృతురాలు భర్తకు చేయి విరగగా, మిగతా ప్రయాణికులకు పాక్షికంగా దెబ్బలు తగిలాయి. మృతురాలు రేణుక రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త, కూతురు ఉన్నారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేతనాలు చెల్లించేవరకూ పోరాడుతాం

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని ఆలోపు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేస్తున్న సానిటేషన్, స్వీపర్స్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని జీఓ 60 ప్రకారం రూ.15వేలు 600 వేతనం చెల్లించాలని రిమ్స్ ఓపీ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అక్కడే బైఠాయించి నినాదాలు చేస్తూ హోరెత్తించారు. కిరణ్ మాట్లాడుతూ రిమ్స్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, పేషంట్ కేర్, సానిటేషన్, స్వీపర్స్, సెక్యూరిటీ గార్డు చాలా సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. కాంట్రాక్టర్ చాలా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం వేతనాలు చెల్లించకుండా తక్కువ చెల్లిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.15వేల 600లలో కార్మికుడికి రూ.12వేల 093లు చెల్లించి మిగిలినవి పీఎఫ్, ఈఎస్ఐ ఖాతాలలో జమ చేయాల్సి ఉందని, కానీ కాంట్రాక్ట్ సంస్థలు అన్ని కుమ్మక్కై రాష్ట్రవ్యాప్తంగా రూ.10వేల 500లు, రూ.11వేలు మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు. లక్షల రూపాయలు కార్మికుల డబ్బు కాజేస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం చెల్లించే విధంగా జిల్లా కలెక్టర్, రిమ్స్ డైరెక్టర్ అధికారులకు, కాంట్రాక్టర్లకు తగిన ఆదేశాలు ఇవ్వాలని, కాంట్రాక్టర్ ఇవ్వని పక్షంలో చర్యలు తీసుకోవాలని అన్నారు. పీఎఫ్ యజమాని వాటాను రూ.15వేలు 600లు కూడా కార్మికుడి వేతనంలో కట్ చేసి జమ చేస్తున్నారని, ప్రభుత్వం విడిగా 12 వాటా చెల్లించాలని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, వాటాలు ప్రతినెలా కార్మికుల వేతనాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. హాస్పిటల్ వర్కర్స్ డ్రెస్ చేంజ్ రూమ్‌లు లేకపోవడంతో పేషంట్స్ టాయిలెట్స్, బాత్‌రూముల్లో డ్రెస్ చేంజ్ చేసుకుంటున్నారని, రెస్ట్ రూమ్‌లు లేకపోవడంతో భోజనాలు వరండాలు, వార్డులు,

చెట్ల కింద చేస్తున్నారని ప్రత్యేకంగా రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఐడీ కార్డు, యూనిఫాం, బ్లౌజ్‌లు, షూస్, ఇతర పరికరాలు సరిపడా ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.గంగన్న, రిమ్స్ కార్యదర్శి పెర్క దేవిదాస్, నాయకులు సుమన్ తాయి, అనసూయ, రమేష్, రమాకాంత్ సుభాష్, దశాంత్ పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని తహసీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-బాసర

రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పవనచంద్రకు పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో పీఆర్టీయూ సంఘం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కోక్కుల గంగాధర్, ప్రధాన కార్యదర్శి పి.రవీందర్‌రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, మహిళ ఉపాధ్యక్షురాలు ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డిక్లరేషన్ అమలు



నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ శుక్రవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పార్టీ ఇచ్చిన డిక్లరేషన్ పూర్తిస్థాయిలో అమలు చేస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యే టికెట్ ఎవరికి వచ్చిన సమిష్టిగా పనిచేసి ఎమ్మెల్యే అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సీఎం మొదటి సంతకం రైతుల రెండు లక్షలు రుణమాఫీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జు పటేల్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వరకూ ఉద్యమం

- జాక్టో ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని వివేకానంద బీఎడ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఉన్నతి శిక్షణ కార్యక్రమంలో జిల్లా జాక్టో స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం పాటిస్తూ, భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జాక్టో చైర్మెన్ జాదవ్ అశోక్ కుమార్ మాట్లాడుతూ సీపీఎస్ మహమ్మారిని వెంటనే రద్దు పరచి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు బలవంతంగా తీసుకొచ్చిన సీపీఎస్ విధానంలో మరణించిన ఎంతోమంది ఉద్యోగ ఉపాధ్యాయుల కుటుంబాలు రోడ్డున పడి కనీస పెన్షన్ కూడా పొందకుండా దుర్భర జీవితాన్ని గడుపుతున్నాయని అన్నారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్ విధానాన్ని కొనసాగించడం విడ్డూరమని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మూగ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినటువంటి సందర్భంలో అప్పటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని మీరు సీపీఎస్‌లో కొనసాగుతారా ఓపీఎస్‌లో కొనసాగుతారా అని ఐచ్ఛికాన్ని అడిగినటువంటి సందర్భంలో అప్పటి తెలంగాణ ప్రభుత్వం మరి సీపీఎస్‌ను కొనసాగించడానికి మొగ్గుచూపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోబడ్డటువంటి వారికి పెన్షన్ ఇస్తుండగా నిస్వార్థంగా ప్రభుత్వ పథకాలను ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో తమ జీవితాలను త్యాగం చేస్తున్నటువంటి ఉద్యోగ ఉపాధ్యాయులకు వారి కుటుంబాలకు పెన్షన్ ఇవ్వకపోవడం చాలా దారుణమని అన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం దశలవారీగా ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నాయని ఈ విధానాలను ఇక ఏ మాత్రం ఉపేక్షించేది లేదని సీపీఎస్ రద్దుపరిచే వరకు నిరంతరంగా ఉద్యమ బాట పట్టడానికి ఉపాధ్యాయ సంఘాలు సిద్ధంగా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బెజ్జంకి రవీంద్ర మాట్లాడుతూ స్టాక్ మార్కెట్‌తో సంబంధం ఉన్నటువంటి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాల్సినటువంటి ఆవశ్యకత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని వెంటనే ఓపీఎస్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని అన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ ముజఫర్ హుస్సేన్, గోమతిరెడ్డి, ఎస్ఎల్టీఏ జిల్లా అధ్యక్షులు గీతేష్ కుమార్, ఎస్టీయూ నాయకులు బత్తూరి సత్యనారాయణ, చంద్రశేఖర్, పోచారెడ్డి, జాదవ్ అర్జున్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్‌లను అప్పగించిన ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మొబైల్ ఫోన్ పోయిందా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో కానీ సీఈఐఆర్ పోర్టల్‌లో గాని ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు ముఖ్య కార్యాలయంలో శుక్రవారం గత మూడు నెలలలో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్‌లో మొబైల్ ఫోన్స్ పోగొట్టుకున్న 21 మంది బాధితులకు మొబైల్ ఫోన్స్ కనిపెట్టి తిరిగి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. ఆదిలాబాద్ వన్ టౌన్ పరిధిలో ఒక ఫోన్, టు టౌన్ పరిధిలో రెండు ఫోన్‌లు, మావల1, ఆదిలాబాద్ రూరల్1, ఇంద్రవెల్లి 1, గుడిహత్నూర్ 2, తలమడుగు ఒకటి మొత్తం 9 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు. మొబైల్ ఫోన్ జాగ్రత్తగా ఉంచుకోవాలని నేరస్తులు దొంగలించబడిన మొబైల్ ఫోన్లను దుర్వినియోగం చేసి అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఎస్పీలు వి.ఉమేందర్‌రెడ్డి, శ్రీనివాస్, పోతారం శ్రీనివాస్, సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ డి.సాయినాథ్, సైబర్ సెల్ ఇన్‌చార్జ్ సింగజివర్ సంజీవ్ కుమార్, ఎస్సై లక్ష్మణ్, సీసీఎస్ సిబ్బంది రాహత్, గంగారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్‌ల గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాలలో 2023- 24 విద్యా సంవత్సరంగానూ పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులలో అడ్మిషన్ల కొరకు ఈనెల 21 వరకు పొడిగించినట్టు ఆదిలాబాద్ డీఈఓ ప్రణీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లు, మండల విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయ సిబ్బంది ఇట్టి విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని పేర్కొన్నారు. అభ్యాసకులు అధిక సంఖ్యలో అడ్మిషన్ పొందుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

అనుమతి లేకుండా చేపలు పట్టిన వారికి జరిమానా

నవతెలంగాణ-దిలావర్‌పూర్

అనుమతి లేకుండా చెరువులో చేపలు పట్టిన ఇద్దరు వ్యక్తులకు పంచాయతీ నిర్వహించి రూ15వేల జరిమానాను విధించారు. శుక్రవారం నర్సాపూర్(జి) దేవుని చెరువు సమీపంలో అనుమతి లేకుండా అద్నాన్, సన్నీ చేపలు పడుతుండగా గంగపుత్రులు గమనించి, వారిని పట్టుకున్నారు. గ్రామంలో పంచాయతీ నిర్వహించి జరిమానా విధించారు. ఇక నుంచి ఎవరైనా అనుమతి లేకుండా చెరువుల్లో, గొలుసుకట్టు కాలువల్లో చేపలు పడితే రూ. లక్ష జరిమానా విధిస్తామని గంగపుత్రులు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత

- పట్టణంలో ఏఎన్ఎంల ర్యాలీ
- 18వ రోజుకు చేరిన నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు ఎటువంటి రాత పరీక్షలు లేకుండా యధావిధిగా రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న డిమాండ్ చేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. కాగా శుక్రవారం సమ్మె 18వ రోజుకు చేరుకోగా అంబేద్కర్ చౌక్‌లోని విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ముందుగా సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ సమ్మె చేపట్టి నేటికి 18 రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే తమ న్యాయమైన డిమాండ్ లను పరిష్కారించాలని లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని అన్నారు. గత 20 సంవత్సరాలుగా వీరంతా పనిచేస్తున్నారని, గతంలో డీఎస్సీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్, మెరిట్ ప్రకారం ఎంపికై విధులు నిర్వర్తిస్తున్నారని అన్నారు. మళ్లీ వీరిని పరీక్ష రాయమనడం న్యాయం కాదన్నారు. ఇప్పటికే చాలామంది ఏజ్ బార్ అయ్యిరని అన్నారు. వీరిని ఖాళీ పోస్టులలో సీనియారిటీ ప్రకారం రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని అన్నారు.

అలాగే ఇతర జీతభత్యాలు, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని షీటీం ఇన్‌చార్జ్ ఏఎస్సై సునీత అన్నారు. శుక్రవారం జెడ్పీఎస్ఎస్ అంకోలిలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీటీం ఇన్‌చార్జీ ఏఎస్సై సునీత మాట్లాడుతూ ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేసిన వెంటనే భయపడకుండా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ నేరాలు, 1930 నెంబర్ బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, క్యూఆర్ కోడ్, ఫోక్సో యాక్ట్, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ సాధికారత కేంద్రం ఆదిలాబాద్ జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోధ, మిషన్ శక్తిలో భాగంగా మహిళ సాధికారత గురించి అవగాహన కల్పిస్తూ, బెటి బచావో-బెటి పడావో పథకం అవశ్యకత, బాల్యవివాహం వల్ల వచ్చే ఇబ్బందులు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఇబ్బందులకు గురైన వెంటనే షీటీమ్ నెంబర్ 8712659953 ఫోన్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సత్యమోహన్, విజయ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహిళ సాధికారత బృందం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో అండర్-17 విభాగం జిల్లాస్థాయి బాలబాలికల ఖోఖో ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 250 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఎంపిక పోటీలను పాఠశాల ప్రిన్సిపల్ ఆగస్టీన్‌తో కలిసి గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాకారులు తమ ప్రతిభను చాటాలన్నారు. ఎంపిక పోటీలు పారదర్శకంగా నిర్వహించబడతాయని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని ఎంపిక పోటీలను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ఫణిందర్, కోఆర్డినేటర్ మారుతి శర్మ, గురుకులం స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, పెటా ప్రధాన కార్యదర్శి స్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు మహేష్, జయశ్రీ, రాము, ప్రతాప్ సింగ్, సత్యనారాయణ, కోచ్‌లు రంజిత్, శివకృష్ణ పాల్గొన్నారు.

అనుమానం పెనుభూతమై...

- భర్త చేతిలో భార్య, రోడ్డు ప్రమాదంలో భర్త ఇద్దరూ మృతి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అనుమానం పెనుభూతమైంది. పచ్చని కాపురంలో చిచ్చు పెట్టింది. ఫలితంగా జీవిత చరమాంకం వరకు తోడుగా నిలవాల్సిన భర్తే తన భార్యను కడతేర్చిన ఘటన బంగారుగూడలో శుక్రవారం కలకలం రేపింది. తరువాత కొద్ది గంటల్లోనే తానూ ప్రమాదానికి గురై దుర్మరణం పాలైన తీరు.. తప్పు చేసిన వాడికి శిక్ష తప్పదన్న సత్యాన్ని చాటి చర్చనీయాంశంగా మారింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...పట్టణంలోని బంగారుగూడ కాలనీకి చెందిన అరుణ్(30)కు నిజామాబాద్ జిల్లా బాల్కొండకు చెందిన దీప(25)తో ఈ యేడాది మేలో వివాహం జరిగింది. భార్యపై అనుమానం పెంచుకున్న అరుణ్ తరుచు గొడవ పడేవాడు. గురువారం రాత్రి సయితం భార్యభర్తలు గొడవపడగా అరుణ్ తన భార్య దీప తలను మంచానికి గుద్దడంతో రక్తస్రావం జరిగి ఆమె అక్కడికక్కడే కన్నుమూసింది. అయితే తెల్లవారాక నింధితుడు లొంగిపోయేందుకు రూరల్ పోలీసు స్టేషన్ వైపు మోటారు సైకిల్‌పై వెళ్తున్న క్రమంలో ఖుర్షీద్‌నగర్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుకనుంచి బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అరుణ్ సైతం అక్కడికక్కడే మృతి చెందాడు. అనుమానం, క్షణికావేశం గంటల వ్యవధిలోనే ఆ దంపతులను కాటికి చేర్చింది. పెండ్లయిన 3 నెలల్లోనే వారి నిండు జీవితాలు ముగిసిన తీరు... తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. టూ టౌన్ సీఐ అశోక్, ఎస్సైలు ఘటన స్థలానికి చేరుకోని విచారణ చేపట్టారు. మృతు రాలి తల్లి చౌహన్ లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్ తెలిపారు.



బీదరెల్లిలో ఆజాదీకా అమృత్ మహోత్సవం

నవతెలంగాణ-బాసర

మండల పరిధిలోని బీదరెల్లి గ్రామంలో శుక్రవారం బీజేపీ కార్యకర్తలు అజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా మట్టిని సేకరించిన్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి పండే తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో అమృతవాటిక నిర్మాణానికి దేశంలోని ప్రతి గ్రామం నుంచి సేకరించిన మట్టిని వాడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, జాతీయ అధ్యక్షులు ప్రకాష్ నడ్డా పిలుపు మేరకు నా భూమి నా దేశం ప్రచార కార్యక్రమంలో భాగంగా మట్టిని సేకరించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గణేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు యోగేష్, విశ్వనాథ్, సందేశ్, దేవన్న, శంకర్, సంపత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండల కేంద్రంలోని 33 కేవీ సబ్ స్టేషన్, అక్కాపూర్ నుంచి వడ్డేపల్లి వరకు గల 220 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు జరుగనున్న దృష్ట్యా శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు వడ్యాల్, నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ శాఖ ఏఈ మహేష్ తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఇన్‌స్పైర్ మానక్ నామినేషన్ల గడువు పొడిగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇన్‌స్పైర్ మానక్ అవార్డులో నామినేషన్ గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్టు ఆదిలాబాద్ డీఈఓ ప్రణీత శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యజమాన్యాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఇన్‌స్పైర్ మానక్ మొబైల్ యాప్ ద్వారా లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌స్పైర్‌అవార్డ్స్‌ప్సెన్‌డీఐఎస్‌టీ.గావ్.ఇన్ వెబ్‌సైట్‌లో సంబంధిత పాఠశాలలో స్కూల్ అథారిటీ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9440060288 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అదుపు తప్పి కారు బోల్తా..
మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసం

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని ఆలుగామా గ్రామంలో గురువారం రాత్రి అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటన గ్రామంలో బయందోలనకు గురి చేసింది. వివరాల్లోకి వెళితే అదే గ్రామానికి చెందిన కొడిపే కిరణ్ తన స్నేహితుని వాహనన్ని తీసుకొని చెన్నూర్ నుంచి రాఖీ పండుగ కోసం ఆలుగామ గ్రామానికి వచ్చి వాహనాన్ని బస్ స్టాండ్ దగ్గర పార్క్ చేయగా అక్కడే బస్టాండ్ దగ్గర ఉన్న చాకటి లింగమూర్తి అనే వ్యక్తి కిరణ్ కారును తీసుకొని గ్రామంలో చక్కర్లు కొట్టి వస్తున్న క్రమంలో బ్రేక్ ఫెయిల్ అయి పల్టీ కొట్టింది. దీంతో రోడ్డుపై ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను కారు డికొనడంతో నుజ్జు నుజ్జు అయిపోయాయి. అలాగే పక్కనే ఉన్న ఫెర్టిలైజర్ షాప్ డోర్ పూర్తిగా పాడై పోయాయి. ప్రమాదంలో డ్రైవర్‌కి అందులో ఉన్న వ్యక్తులకు ఎలాంటి ప్రాణహాని జరగలేదు. దీంతో గ్రామ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కొమ్ముగూడ రోడ్డుపై వట్టివాగు కాలువ నీరు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని ఈదులవాడ గ్రామపంచాయతీ పరిధిలో గల కొమ్ముగూడ గ్రామం వద్ద కాలువ నీరు రోడ్డుపై ప్రవహిస్తూ ప్రజలకు ఇబ్బందికరంగా మారుతుంది. గొల్లగూడ నుంచి ఈదులవాడ వెళ్లే మార్గంలో వట్టివాగు కాలువపై కల్వర్టు నిర్మించినప్పటికీ అది తక్కువ ఎత్తులో ఉండడంతో నీరు ప్రవహిస్తోంది. దీనితో అక్కడ బురద ఏర్పడి ద్విచక్ర వాహనాలు జారిపడే ప్రమాదం ఉంది. వర్షాకాలం వర్షాలు ఎక్కువ పడ్డ సమయంలో మరింత ఇబ్బందిగా మారుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు ఎత్తు పెంచి నీరు రోడ్డు పైకి రాకుండా చూడాలని కోరుతున్నారు.

నిబంధనలు పాటించని లారీలపై చర్యలేవి : సీఐటీయూ

నవతెలంగాణ-మందమర్రి

పరిమితికి మించిన బొగ్గుతో టార్పాలిన్ లేకుండా నిబంధనలు పాటించని లారీలపై చర్యలేవని ఎస్‌కేఎస్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మందమర్రి నుంచి శ్రీరాంపూర్‌కి కార్మికులు, ప్రజలు నిత్యం ప్రయాణిస్తారని, బొగ్గు టిప్పర్లు నిబందనలకు విరుద్ధంగా నడుపుతున్నారని తెలిపారు. బొగ్గును తరలించే క్రమంలో లారీలలో ఓవర్‌లోడ్ వేసుకోని వాటిపై టార్పాలిన్ కప్పకుండా నడపడంతో వెనుక వచ్చే వాహన దారుల కళ్ళలో బొగ్గు చూర పడి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఓవర్ లోడ్‌తో ప్రయాణించడంతో స్పీడ్ బ్రేకర్ల వద్ద బొగ్గు పెళ్ళలు కిందపడి ప్రక్కన వెళ్లే ప్రయాణికులకు ప్రమాదాలు జరిగి ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ప్రమాదం జరిగినప్పుడు తూతూ మంత్రంగా హడావిడి చేసి వదిలేస్తున్నారే కానీ శాశ్వత పరిష్కారం చూపించడంలో విఫలం అవుతున్నారని విమర్శించారు.

ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

• ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ బేషరతుగా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులతో కలిసి రెండవ రోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కేసీఆర్ కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని చెప్పి నేటికీ దశబ్ది కాలం పూర్తవుతున్న ఒక్క ఉద్యోగుని కూడా పెర్మనెంట్ చేయలేదని అన్నారు. రాష్ట్రంలో సుమారుగా 16,000 మంది ఉద్యోగులు గత 23 సంవత్సరాలగా పనిచేస్తూ చాలీచాలని వేతనాలు తీసుకుంటూ పేద బడుగు బలహీన వర్గాలకు వైద్యం అందించడంలో వారి ప్రాణాలను కాపాడడంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పినట్టు నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులందరిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెల్త్ ఇన్సూరెన్స్ రూ.పదిలక్షలు కల్పించాలని, దురదృష్టవత్తు మరణించిన వారికి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన బుడిపెల్లి మధుకర్, సధాలక్ష్మి, రాణి, గంగుబాయ్, లక్ష్మీ పాల్గొన్నారు.

నేటి చలో జీఎం కార్యాలయం విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

11వ వేజ్ బోర్డు ఏరియర్స్ సాధన కోసం ఆగస్టు 2వ తేదీన నిర్వహించే జీఎం కార్యాలయం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కె సమ్మయ్య కోరారు. శుక్రవారం ఎస్ఆర్పీ-3 గనిలో ఫిట్ సెక్రటరీ మురళి చౌదరి అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. సింగరేణి కాలేజీలో 11వ వేజ్ బోర్డు 23 నెలలకు సంబంధించిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కోల్ ఇండియాలో ఉన్నటువంటి బొగ్గు సంస్థల్లో సెప్టెంబర్ 3వ తేదీన అక్కడి కార్మికులకు బకాయిలు చెల్లిస్తున్నారని తెలిపారు. సింగరేణి కంపెనీ కంటే తక్కువ లాభాల్లో ఉన్న ఆ సంస్థ చెల్లించినప్పుడు సింగరేణి సంస్థ కూడా అదే రోజు చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి రూ.వేలకోట్ల టర్నోవర్‌తో లాభాలు గడిస్తున్న కార్మికులు మాత్రం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ఇప్పుడు కూడా 11వ వేజ్ బోర్డు ఏరియర్స్‌కు సంబంధించి కంపెనీ వద్ద డబ్బులు లేకనే చెల్లించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి సుమారు రూ.25 వేల కోట్ల చెల్లించాల్సి ఉందని, వాటిని చెల్లించకపోవడం వల్లే బకాయిలు ఆలస్యం అవుతుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం పెరిగి ఆర్థిక మాంద్యం ఏర్పడిందని, పార్టీల అనుబంధ సంఘాలను సింగరేణిలో గెలిపించుకోవడం ద్వారా ఇలాంటి కష్టాలను కార్మికులు అనుభవిస్తున్నారన్నారు. యూనియన్లకు అతీతంగా మూడవ తేదీన జరిగే ధర్నాలో పాల్గొని ఏరియర్స్‌ను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ కార్యదర్శి మోతుకూరి కొమరయ్య, ఆర్కే-5 పిట్ కార్యదర్శి గుడిగంటి నర్సింగరావు, కాంట్రాక్ట్ కార్మిక సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఎస్ఆర్పీ-3 నాయకులు అంబాల రవి, వైస్ ప్రెసిడెంట్ మల్లేష్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి, షిఫ్ట్ సెక్రటరీలు రాచర్ల రవీందర్, రాందేని రవి, భట్టారి శ్రీకాంత్, కల్లెపెల్లి ప్రశాంత్, ఈర్ల పోశం, గోపి, కాల్వ ఐలయ్య, లక్ష్మీనారాయణ, రవితేజ, ప్రనిల్, సుధాకర్, పాష పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



నవతెలంగాణ-జన్నారం

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీపీఐ మంచిర్యాల జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కళిందర్ ఖాన్ అన్నారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు తాయిలాలు పూయడానికి ప్రభుత్వం పూనుకుందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న అర్హులైన వారికి పోడు భూములకు పట్టాలివ్వాలన్నారు. రైతులకు చేసిన రుణమాఫీతో ఆ డబ్బులు వడ్డీకే సరిపోలేదన్నారు. మండలంలోని 29 గ్రామాలలో వ్యవసాయం ఎక్కువగా ఉన్నందున, ఈ మండలాన్ని వ్యవసాయ ఆధారిత మండలంగా గుర్తించాలన్నారు. ఈ మండలానికి విద్యుత్ సౌకర్యం, సక్రమంగా లేక తరచు విద్యుత్తు కోతలు విధించడంతో రైతులకు సామాన్య ప్రజలకు, వెల్డింగ్ షాప్‌లకు జిరాక్స్ సెంటర్లకు, చిరు వ్యాపారాలు చేసుకునే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పది సంవత్సరాల పాలనలో రాష్ట్రంలో ఎలాంటి అభివద్ధి జరగలేదన్నారు. కార్మికులు చేస్తున్న సమ్మెలను, ప్రభుత్వం గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గిరిజన గిరిజన నేతరుల పోడు భూములకు పట్టాలి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తిరుపతి, గిరిజన సంఘం నాయకుడు అబ్దుల్లా హాజీపూర్ మండల అధక్షుడు పోచన్న రవి అమీబాయి పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

• సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య



నవతెలంగాణ-చెన్నూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని భూ పోరాట సమీతి కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో ఆయన మాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలను, ధరల పెరుగుదలను, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల అమలులో నిర్లక్ష్యంను నిరసిస్తూ సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా భూ పోరాట కేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పేర్కొన్నారు. పెరిగిన ధరలు సామాన్యునికి భారంగా మారాయని తెలిపారు. పేదలను అదుకోవాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నిరేత్తినట్టు వ్యవహరించడం సరికాదని అన్నారు. జిల్లా కార్యదర్శి సంకే రవి, జిల్లా కమిటీ సభ్యులు బిచందు, పట్టణ కన్వీనర్ ఎండీ హవేజ్, ఇండ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు రవి, మారయ్య, పోచ్చక్క, ఉమారాణి, సరిత, రాజేశ్వరి, రమ్య, రేణుక, రజిత, కరీమ్, బీ.నగేష్, భూదేవి, సమ్మక్క, మణి పాల్గొన్నారు.

బీసీలను విస్మరిస్తున్న సీఎం కేసీఆర్



నవతెలంగాణ-దండేపల్లి

అన్ని కులాలకు పెద్దపీత వేస్తూ పథకాలు ప్రవేశపెడుతున్న సీఎం కేసీఆర్ వెనుకబడిన తరగతుల వారిని విస్మరిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేరబెల్లి రఘునాథ్ అన్నారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో బీసీ బందును ప్రవేశపెట్టాలని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సంధ్యకు వినతి పత్రం అందజేసిన అనంతరం మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడుతూ వెనుకబడిన తగతులవారిలో చాలామంది పేదవారు ఉన్నారని, దళిత బంధు తరహాలో బీసీ బందు కూడా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. బీసీ బంధు ప్రవేశపెట్టేంతవరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజన్న, ప్రధాన కార్యదర్శి బందెల రవి గౌడ్, ఉపాధ్యక్షుడు కిషన్ నెల్కి మల్లేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు వనపర్తి రాకేష్, బీసీ మోర్చా అధ్యక్షుడు అనిల్ కుమార్, అధ్యక్షుడు బోర్లకుంట వెంకటేష్, బోడ సత్యనారాయణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు నందుర్క సుగుణ, ముత్యంపేట ఉపసర్పంచ్ వెంకటేష్, నాయకులు సత్తయ్య దోమటి వెంకటేష్, ముత్తినేని మల్లేష్, శేఖర్, సతీష్ నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారలోపం నివారించేందుకే 'కిశోరామృతం'

• ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కిశోర బాలికలలో పోషణ లోపాన్ని అధిగమించేందుకు కిశోరామృతం ఎంతో దోహదపడుతుందని ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిశోరామృతం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కిశోర బాలికల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకంలో భాగంగా 14 నుండి 18 సంవత్సరాల వయసు గల కిశోర బాలికలకు పోషకాహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యాన్ని కాపాడినట్లవుతుందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన కిశోర బాలికలకు 3.5 కిలోల కిశోరామృతం అందించడం జరుగుతుందని తెలిపారు. కిశోరామృతం శరీరానికి కావలసిన అదనపు శక్తిని అందిస్తుందని, సూక్ష్మ పోషకాల లోపాన్ని భర్తీ చేస్తుందని, రక్తహీనత నివారించడానికి సహాయపడుతుందని, కిశోర బాలికల పోషణకు, ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని అన్నారు. బలమైన శరీరం, మెదడు కోసం రోజువారీ ముఖ్య పోషకాలు గల ఆహారం తీసుకోవడంతో పాటు రోజుకి 10 స్పూన్లు (140గ్రాముల), నెల రోజుల్లో 3.5 కిలోల కిశోరామృతం తినాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో జనాభా, పోషణ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లలు జిల్లా అదనపు కలెక్టర్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 'రీడ్ ఏ థాన్ -2023' కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించి, విద్యాబోధనపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, సీడీపీఓ సాదియ, సూపర్ వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం



నవతెలంగాణ-జన్నారం

ఒక సీసీ కెమెరా 100మంది పోలీసులతో సమానమని జన్నారం ఎస్సై పీ.సతీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామంలోని వారందరూ కలిసి ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయుటకు సహకరించాలన్నారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. స్పందించిన గ్రామస్తులు ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. పది వేలు, కిరాణా షాపుల యజమానులు రూ.9000, హనుమాన్ టెంట్ హౌస్ జీ.రవి రూ.వెయ్యి చొప్పున చందాలు వేసుకొని, సీసీ కెమెరాల నిర్వహణ కమిటీ చైర్మన్ ఆ గ్రామ సర్పంచ్ జాడి గంగాధర్‌కు అందించారు. త్వరలో సీసీ కెమెరాలు కొనుగోలు చేసి గ్రామంలోని అన్ని ప్రధాన కూడలిలలో ఏర్పాటు చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు, సర్పంచ్ జాడి గంగాధర్ తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-చింతలమానెపల్లి

మండలంలోని కర్జవెల్లి గ్రామానికి చెందిన బిబ్బేర గౌరక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గౌరక్కకు సంతానం లేకపోవడంతో మృతురాలి సమీప బంధువులు అంత్యక్రియల కోసం ఇబ్బందులు పడుతుండగా, విషయం తెలుసుకొని చౌదరి లక్ష్మణ్ అంత్య క్రియలకు రూ.8,000 వేలు, 25 కేజీల బియ్యం, ఇతర సామాగ్రి అందజేశారు. ఆర్థిక సాయం చేసిన లక్ష్మణ్‌ను ఆ గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూజారి భీమయ్య, పూజరి తిరుపతి, చౌదరి హరి, కిష్టయ్య, నాగయ్య పాల్గొన్నారు.

భూగర్భ గనుల్లో 93 శాతం ఉత్పత్తి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని భూగర్భ గనుల్లో ఆగస్టు నెలలో నిర్దేశించిన 1,36,500 టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి గాను 1,26,576 టన్నుల ఉత్పత్తితో 93 శాతం సాధించినట్టు ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఉపరితల గనిలో 73శాతం ఉత్పత్తి సాధించామని, మొత్తంగా ఆగస్టు నెలలో 4,46500 టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను, 3,51,736 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి 79 శాతం సాధించినట్లు తెలిపారు. ఓవర్ బర్డెన్ తీసే కంపెనీల కాలపరిమితి ముగియడంతో, కొత్తగా రెండు కంపెనీలు వచ్చాయని, వాటి వలన ఓబీ తీయడంలో జాప్యం జరిగిందని, అలాగే వర్షాకాల ప్రభావరీత్యా కొంతమేర ఉత్పత్తి తగ్గిందని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల ద్వారా కార్మికుల కుటుంబాలకు అందించే నీరు రంగు మారిందని, జీఎస్ఎల్ఆర్ రిపేర్ చేసి అటువంటివి పునరావృతం కాకుండా చేశామన్నారు. కార్మికుల కాలనీల్లో రెండు మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశామని, ఇంకొకటి ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్మికుల సంక్షేమం దృష్ట్యా వారికి అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని అందులో భాగంగానే నిరుద్యోగులకు గ్రంథాలయం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే చెన్నూర్‌లో సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా విద్యుత్తు అక్టోబర్ 31 వరకు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో గైర్హాజరైన కార్మికులకు జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ప్రతినెల 6వ తేదీ నుండి 11వ తేదీ వరకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీఎం ఐఈడి చిరంజీవులు, ఇన్‌ఛార్జి డీజీఎం పర్సనల్ రాజేశ్వర్ రావు, సీనియర్ పీఓ కాంతారావు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంల నిరసన కొనసాగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



బేషరతుగా తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్‌తో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా రెండవ ఏఎన్ఎంలు 17వ రోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ రెండో ఏఎన్ఎంల కడుపుకోత ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ నిర్వహించాలనే డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. రెండవ ఏఎన్ఎంలు చాలీచాలని వేతనాలు తీసుకుంటూ ప్రజల ఆరోగ్యాలు కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నోటిఫికేషన్ రద్దుచేసి రెగ్యులర్ చేయాలని లేని పక్షంలో ఈ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టీ.దివాకర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, ఏఎన్ఎంల యూనియన్ రాష్ట్ర నాయకురాలు వసంత, జిల్లా అధ్యక్షురాలు సంతోషి, ప్రధాన కార్యదర్శి పుణ్యవతి, ఉపాధ్యక్షులు రజిని, భాగ్య, ప్రచార కార్యదర్శులు భూదేవి, ప్రమీల, కోశాధికారి సునీత, నాయకులు తిరుమల, సునీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

• పీఆర్టీయూటీఎస్ మండల అధ్యక్షుడు రావనవేని రవి

నవతెలంగాణ-దండేపల్లి



నూతన పెన్షన్ విధానంతో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రావనవేని రవి అన్నారు. శుక్రవారం దండేపల్లిలోని కస్తూర్బా గాంధీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. సీపీఎస్ వద్దు ఓపీఎస్ ముద్దు అని నినాదాలు చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించడంలో పీఆర్టీయూ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. కేజీబీవీ ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు హెల్త్ కార్డు సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూటీఎస్ అలుపెరగని పోరాటం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు కర్నె నరేందర్, పత్రిక ప్రధాన సంపాదకులు రాసపల్లి రవి పాల్గొన్నారు.

జాబితాలో తప్పల్లేకుండా ఉండాలి

తాండూర్ : తుది ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలని తహసీల్దార్ రోహిత్ సూచించారు. ఓటర్ల నమోదు ప్రత్యేక క్యాంపెయిన్ సందర్భంగా ప్రకటన విడుదల చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం ఓటర్ల జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రదర్శించామని తెలిపారు. ప్రజలు ఓటర్ జాబితాలో వారి పేర్లు సరి చుసుకోవాలన్నారు. పేరు లేనివారు ఫారం నం.6లో వివరాలను నమోదు చేసి ఓటు హక్కు పొందవచ్చునని తెలిపారు. ఫామ్ నంబర్-7 ద్వారా పెళ్లి అయి వెళ్లి పోయిన వాళ్ళు కానీ, వేరే గ్రామానికి వెళ్లి పోయినా వారు కానీ లేదా మరణించిన వారి పేర్లు కానీ ఉన్నట్లయితే తొలగించవచ్చని తెలిపారు. ఓటర్ జాబితాలో పేరు, తండ్రి పేరు వయస్సు సవరణలు ఉనున్నట్లయితే ఫారం నెం.8 ద్వారా సంబంధిత బూత్ లెవెల్ అధికారినిసంప్రదించాలని కోరారు.

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్ : జిల్లాకు నూతనంగా మంజూరైన మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థినుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జ్యోతిబాపూలే గురుకుల విద్యాసంస్థల కన్వీనర్ ఎస్ వెంకటప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నుండి తరగతులు ప్రారంభం కానున్నాయని ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు బీఏ (ఈపిహెచ్), బి కామ్ (సీఏ), బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఎస్సీ(బీజెడ్‌సి) కోర్సుల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి బాబాపూర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9154102677, 9502081884 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ

ప్రభుత్వ పథకాలను లబ్దిదారులు సద్వినియోగంచేసుకోవాలని తహసీల్దార్ ప్రవీణ్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపిల్ల పెళ్లి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శంకర్ నాయక్, ఫకీర్ నాయక్ సర్పంచ్ జాదవ్ లచ్చిరామ్, జూనియర్ అసిస్టెంట్ సాజిద్, జాదవ్ బిక్కు, గంగాధర్ పాల్గొన్నారు.



కిశోర అమృతం పంపిణీ

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని సదాశివ్‌పేట్ అంగన్‌వాడీ కేంద్రంలో యుక్త వయసు బాలికలకు కిశోర అమృతం సర్పంచ్ వొజ్జెల మౌనీష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుక్త వయసు బాలికలలో రక్తహీనత, పౌష్టికాహార లోపం ఉండకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తుగా కిశోర అమృతాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రతినెల ఒక్కొక్కరికి మూడున్నర కిలోల కిశోర అమృతం ప్యాకెట్లు అందిస్తున్నామని, 14 నుండి 18 సంవత్సరాల వయసు గల బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జీజాబాయి, పద్మ ఉన్నారు.



ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి

- జాక్టో ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన



నవతెలంగాణ-ఇచ్చోడ

సీపీఎస్ తమకు వద్దని దాన్ని వెంటనే రద్దుపరచి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఎస్టీయు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్ అశోక్, డి శేషారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని మండలంలోని జడ్పీఎస్ఎస్ నర్సాపూర్‌లో భోజన విరామ సమయంలో జాక్టో ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బలవంతంగా తీసుకొచ్చిన సీపీఎస్ విధానంలో మరణించిన ఎంతోమంది ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలు రోడ్డున పడి కనీస పెన్షన్ కూడా పొందకుండా దుర్భర జీవితాన్ని గడుపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్ విధానాన్ని కొనసాగించడం విడ్డూరమని పేర్కొన్నారు. వెంటనే ఓపీఎస్‌ను పునరుద్దరించాలని పేర్కొన్నారు. లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీఎస్ హెచ్ఎం వేమనరావు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-దహెగాం

అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కాగజ్‌నగర్ రూరల్ సిఐ నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని మారుమూల శకరపురం గ్రామంలో నిరుపేదలకు బియ్యం, దోమ తెరలు, టర్చ్ లైట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల అటవీ ప్రాంతం కాబట్టి అపరిచిత వ్యక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. అలాంటి వారు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత మంచిగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఎలాంటి అవసరమైన పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సనత్‌కుమార్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యలపై అధికారుల నిలదీత

నవతెలంగాణ-కాసిపేట

మండల సర్వసభ్యసమావేశంలో అధికారులే లక్ష్యంగా సభ్యులు పలు సమస్యలపై వారిని నిలదీశారు. విషజ్వరాలు ప్రబలుతున్నా వైద్యాధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో వైస్ ఎంపీపీ పూస్కురి విక్రంరావ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఎంపీటీసీలు, సర్పంచులు మండలంలోని గిరిజన గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నా వైద్యశిబిరాలు నిర్వహించడం లేదన్నారు. అదే విధంగా స్వతంత్ర్య దినోత్సవం రోజున పెద్దనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జెండాను ఎగరవేయాలేదన్నారు. లంబాడి తండా(డి)లో విద్యుత్ స్తంభాలు తక్కువ ఎత్తులో వేయడం పడిపోయే స్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి సర్వసభ్య సమావేశంలో సమస్యలను ప్రస్తవించిన పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాల్సి వైద్యాధికారులు పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను అధికారులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ పూస్కురి విక్రంరావ్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఎ అలీం, ఎంపీటీసీలు కొండబత్తుల రాంచందర్, అక్కెపల్లి లక్ష్మీ చంద్రమోళి, కోఆప్షన్ సిరాజాన్, సర్పంచులు రాంటెంకి శ్రీనివాస్, అజ్మీర తిరుపతి, సంపత్ నాయక్, ఎంఈవో వాసాల ప్రభాకర్, ఎంపీవో నాగరాజు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో అండర్-19 చదరంగం పోటీలు

రెబ్బెన: ఈ నెల 2, 3 తేదీల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-19 తెలంగాణ రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి క్రీడాకారులు పాల్గొనాలని జిల్లా చెస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా తెలంగాణ విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి హాజరుకానున్నట్టు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే చెస్ పోటీలు స్విస్‌లిప్ పద్ధతిలో జరగనున్నాయన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజన సదుపాయం కల్పించనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాల కోసం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.సతీష్(8555008996)ను సంప్రదించాలని తెలిపారు.

గిరిజన మత్స్య శాఖ ఎన్నికలు

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని రొట్టెపల్లి గ్రామ పంచాయతీలో జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో రొట్టెపల్లి గిరిజన మత్స్య శాఖ ఎన్నికలను నిర్వహించారు. గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలో భాగంగా జరిగిన ఎన్నికల్లో అధికారిగా తిరుపతిరెడ్డి వ్యవహరించారు. అధ్యక్షుడిగా పెంద్రం హన్మంతు, ఉపాధ్యాక్షుడిగా సుర్పం రామకష్ణ, కార్యదర్శిగా చిక్రం దశ్వంతతు ఏకగ్రీవం కాగా, సభ్యులుగా గణపతి, కుర్సేంగ జలపతి, కుర్సేంగ తిరుపతి, పెంద్రం తిరుపతి, టేకం భీము, కుర్సేంగ గంగులను ఎన్నుకున్నారు. ఈ మేరకు నూతనంగా ఎన్నికైన కమిటీకి నియామక పత్రాలను అందించి సత్కరించారు.

నేడు సర్టిఫికెట్ పరిశీలన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేజీబీవీలో మిగిలిపోయిన పోస్టుల కోసం ఎంపికైన వారికి శనివారం ఉదయం ఉదయం 10 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సర్టిఫికెట్ పరిశీలిస్తామని డీఈవో అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 1:3లో ఎంపికైన వారికి ఇప్పటికే ఫోన్ ద్వారా సమాచారం అందించామని తెలిపారు. ఖాళీలలో భాగంగా సీఆర్‌టీ ఇంగ్లీష్ -2, ఫిజిక్స్ -3, సీఆర్‌టీ సోషల్ -01, సీఆర్‌టీ మాథ్స్ 01, పీఈటీలు 2, పీజీసీఆర్‌టీ మాథ్స్, 01, పీజీసీఆర్‌టీ నర్సింగ్-2 పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఫోన్ ద్వారా సమాచారం అందుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒక్క సెట్ జిరాక్స్ వెంట తీసుకురావాలని సూచించారు.

విజృంభిస్తున్న డెంగ్యూ

మంచం పట్టిన బెజ్జూర్

నవతెలంగాణ - బెజ్జూర్

మండల కేంద్రంలో డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి వాడలో జ్వర పీడితులు పదుల సంఖ్యలో బాధపడుతున్నారు. అధికారులు క్లోరినేషన్ చేయకపోవడం, వైద్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య పరీక్షలు చేసుకున్న వారిలో ఐదుగురికి మాత్రమే డెంగ్యూ సోకినట్టు వైద్య సిబ్బంది తెలుపుతున్నప్పటికీ అనధికారికంగా ప్రతి వాడలో జ్వర పీడితులున్నారు. డెంగ్యూ జ్వరం వస్తుండడంతో ప్లేట్లెట్స్ పడిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయివేట్‌లో వైద్య పరీక్షలు చేయించుకునే స్తోమత లేని ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు. ఆర్థికంగా బాగున్నవారు పట్టణాలకు తరలివెళ్తూ డెంగ్యూ చికిత్సను చేయించుకుంటున్నారు. దోమ కాటుతో వచ్చే డెంగ్యూ జ్వరం నివారణ కోసం ఇప్పటివరకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని మండల వాసులు ఆరోపిస్తున్నారు. బావుల్లో, రోడ్ల పక్కన, మురికి కాలువల్లో క్లోరినేషన్ చేయకపోవడంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతూ జ్వరాలకు కారణం అవుతున్నాయి. డబ్బులు లేని పేద ప్రజలు వైద్యం కోసం ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. బెజ్జూర్‌లో మహేష్, షాహేద్, తిరుపతి, గౌరు తదితరులు డెంగ్యూ బారిన పడి చికిత్స తీసుకుంటున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసిన అనంతరం ఎండతీవ్రత అధికం కావడంతో దోమల వ్యాప్తి రోజురోజుకు పెరిగింది. దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఆ దిశగా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామ పంచాయతీలో క్లోరినేషన్, దోమల నివారణ స్ప్రేను పిచికారి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్న దీక్ష



భాగ్యలక్ష్మి

గ్రామాల్లో ఎల్ఐసీ సేవలు మరింత విస్తృత పర్చాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గ్రామాల్లో ఎల్ఐసీ సేవలను మరింత విస్తతం చేయాలని ఆసిఫాబాద్ బ్రాంచ్ మేనేజర్ సుభాష్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఎల్ఐసీ 67వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భీమా వారోత్సవాలను సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు బీమా విషయంలో అత్యధిక నమ్మకాన్ని కలిగించిన సంస్థ ఎల్ఐసీ అని గర్వంగా చెప్పవచ్చన్నారు. జిల్లాలో సేవలు గ్రామస్థాయిలో విస్తతం చేయడానికి సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఎల్ఐసీ 33 కోట్లకు పైగా పాలసీదారులతో, ఒక లక్షకు పైగా ఉద్యోగులతో, 13 లక్షలకు పైగా ఏజెంట్లతో కొనసాగుతుందన్నారు. ప్రతి ఆర్థిక సంవత్సరం కేంద్ర ప్రభుత్వానికి కొన్ని రూ. కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెడుతుందని, అదే సందర్భంలో గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు విద్యకు కావలసిన ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని గుర్తుచేశారు. ఇక్కడి వారు గతంలో బెల్లంపల్లికి వెళ్లాల్సి వచ్చేదని, బ్రాంచ్ ఏర్పాటుతో వారికి సౌకర్యం కలిగిందన్నారు. సాటిలైట్ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలపై సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ అధికారులు సింగం నర్సయ్య, శ్రీధర్, మహేందర్, ఏజెంట్లు ప్రమోద్, అశోక్, అడప సతీష్, వారణాసి శ్రీనివాస్, తిరుపతి చారి, అంజయ్య, సాయికష్ణ పాల్గొన్నారు.





హాజీపూర్ : దేశవ్యాప్తంగా వివిధ రంగాల ప్రజలకు విశిష్ట సేవలతో భారతీయ జీవిత బీమా సంస్థ అగ్రగామిగా నిలిచిందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మంచిర్యాలలో ఎల్ఐసీ 67వ బీమా వారోత్సవాల ప్రారంభ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీమారంగంలో తన సేవలను అందిస్తు ప్రజల మన్నలను ఎల్ఐసీ పొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఛీఫ్ మేనేజర్ విశ్వేశ్వర్, బ్రాంచి అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ భారతి, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ సురేంద్ర, మాలతీదేవి, ఫణి రామ్మోహన్, నరేష్, మల్లేష్, ఏజెంట్లు తిరుపతయ్య, తిరుపతి రెడ్డి, ఆర్. రాజేశం, శివరంజన్, పోచయ్య, చంద్రశేఖర్ రెడ్డి, చరణ్, సుష్మ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు అధిగమిస్తాం



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాకు సింగరేణి సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సమిష్టి కృషితో అధిగమిస్తామని బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్ అన్నారు. గోలేటి జీఎం కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆగస్టు మాసానికి సంబంధించిన బొగ్గు ఉత్పత్తి ఉత్పాదక వివరాలను వెల్లడించారు. బెల్లంపల్లి ఏరియాలోని గనులు ఆగస్టు మాసంలో 2.00 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా 155 శాతంతో 3.09 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్టు తెలిపారు. మధ్యమధ్యలో వర్షం కురవడంతో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం వాటిల్లిందన్నారు. బెల్లంపల్లి ఏరియాలో నిర్విరామంగా బొగ్గు ఉత్పత్తి చేసిన డోర్లి-1, డోర్లి-2ఓసీపీలకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ ఈ నెల 14న డోర్లి-1ఓసీపీలో నిర్వహిస్తామని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా పరిసర ప్రాంతాల గ్రామాలకు నిధులు మంజూరై అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్ కుమార్ బెహెర, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, కోఆర్డినేటర్ అంజయ్య పాల్గొన్నారు.

డిమాండ్ పరిష్కరించే వరకూ వెనక్కి తగ్గేది లేదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సర్వీస్ క్రమబద్ధీకరించే వరకు వెనక్కి తగ్గేది లేదని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం 5వ రోజుకు చేరుకున్నాయి. వీరి దీక్షలకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు ప్రభోత్ కుమార్, జిల్లా నాయకులు సదయ్య శివరామకష్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికల కంటే ముందే సమగ్ర శిక్ష విధానంలో పనిచేస్తున్న వివిధ విభాగాల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు విజయలక్ష్మీ, గౌరవ అధ్యక్షులు మోహన్, ప్రధాన కార్యదర్శి తుకారాం, కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి సంతోష్, అధికార ప్రతినిధి పవన్, నాయకులు సత్యనారాయణ, భోజన్న, వెంకటమ్మ, తిరుమల పాల్గొన్నారు.

మేకల మందపై పులి దాడి



కాసిపేట : మేకల మందపై పులి దాడి మేకను హతం చేసిన ఘటన మండలంలోని పెద్ద ధర్మారం శివారులో జరిగింది. ఈ ఘటనతో శివారు గ్రామ ప్రజలు భయందోళనలో ఉన్నారు. స్థానికులు, అటవీ శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మేకల కాపరులు గంగులు, రాములు మేకలను పెద్ద ధర్మారం శివారులోకి మేత కోసం తీసుకెళ్లారు. అదే సమయంలో మేకల మందపై పులి దాడి చేసి మేకను లాక్కెళ్లింది. పులిని చూసిన మేకల కాపరులు అక్కడి నుంచి పరుగులు పెట్టి చుట్టూ పక్కల వారికి సమాచారం అందించారు. మేకను చంపి పులి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు స్థానికులు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎఫ్ఆర్‌వో సుభాష్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజర్ ప్రవీణ్ నాయక్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చిరుతపులి అడుగుల మాదిరి ఉన్నాయని అధికారులు వివరించారు. కానీ ప్రత్యక్షంగా చూసిన మేకలకాపరి మాత్రం అది పెద్దపులేనని చెబుతున్నాడు. పాద ముద్రల ఆధారంగా చిరుత పులి లేదా హైనగా అనుమానాలున్నాయని ఎఫ్ఆర్‌వో తెలిపారు. చిరుత లేదా పులి అనే నిర్ధారణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిర్ధారిస్తామన్నారు. మేకల మందపై దాడితో అటవీ శివారు ప్రాంతంలో ఒక్క సారిగా భయాందోళన పరిస్థితులు నెలకొన్నాయి.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

ఆసిఫాబాద్: ఆడ పిల్లలు, మహిళల రక్షణ కోసం అనేక చట్టాలున్నాయని, వాటిపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని షీటీం ఇన్‌చార్జి సునీత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రాల్లో గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఈవ్ టీజింగ్, ఆయా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళ రక్షణ కోసం అనేక చట్టాలను రూపొందించారని, వాటి గురించి విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాలన్నారు. ఈవ్‌టీజింగ్, హింసలకు గురైతే ఆసిఫాబాద్ షీటీం నెం.8712670564ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీవో గంగాధర్, ఆసిఫాబాద్ ఎస్సై లావణ్య, ప్రిన్సిపల్ అనిత, షీటీం సభ్యులు స్వప్న, శ్రీలత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత రక్తదాన శిబిరానికి స్పందన

కెరమెరి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సన్‌రైస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరానికి స్పందన వచ్చింది. ఈ శిబిరంలో 30 యూనిట్ల రక్తాన్ని దాతల నుంచి సేకరించారు. అత్యవసరంలో రక్తం అందక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని ఫౌండేషన్ సభ్యులు అన్నారు. శిబిరంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని లైఫ్‌లైన్ ఆస్పత్రి మేనేజ్మెంట్ మునీశ్వర్ చంద్రశేఖర్ సైతం రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విజయ్ కుమార్, ఎంపీడీవో మహేందర్, ఉప సర్పంచ్ నిసార్ అహ్మద్, నదీమ్ పాల్గొన్నారు.

అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలో కోర్టు వివాదాల్లో ఉన్న సర్వేనెంబర్ 42లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ తొలగించాలని, దీనికి అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ చిప్పకుర్తి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం జేఏసీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వివాదంలో ఉన్న భూమిలో ఎగ్జిబిషన్ నిర్వాహణకు అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. దీనిపై నస్పూర్ తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, అగ్నిమాపక శాఖ అధికారి, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశామన్నారు. అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకొని తక్షణమే ఎగ్జిబిషన్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు విజేష్, జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ కుమార్, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్, బీసీవీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సల్మాన్ పాల్గొన్నారు.

ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలి



నవతెలంగాణ - కౌటాల

ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలని పలువురు రైతులు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే కోనేరు కోనప్పను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. గతంలో పనిచేసిన ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్దరించి ఉపాధి కల్పించాలన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్దరించడానికి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఇందులో ఆదర్శ రైతులు దోని అంజయ్య, కాళిదాసు, దుర్గం పుండలీక్, రమేష్, దుర్గం తిరుపతి, దుర్గం శివరాం, డోంగ్రే విశ్వనాథ్, జాడి ప్రభాకర్ ఉన్నారు.

గోశాల ప్రారంభం



నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని సదాశివ్‌పేట్ శివాలయంలో నూతనంగా ఏర్పాటుచేసిన గోశాలను శుక్రవారం ఆలయ అర్చకులు అంబేద శంకరయ్య, సంతోష్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి పారంభించారు. గోదానం చేయాలనుకున్న వారు ఆలయ ప్రధాన అర్చకులను సంప్రదించాలని, గోశాలలో ప్రస్తుతం దాతలు ఇచ్చిన ఆరు పశువులు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు బండి శైలజగౌడ్, భక్తులు పాల్గొన్నారు.

భారతీయ సాంప్రదాయాలను కాపాడుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని చాటి చేప్పే రాఖీ పండుగా భారతీయ సాంప్రదాయమని, దాన్ని కాపాడుకోవాలని పోతగూడ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల హెచ్ఎం కె. జైవంత్‌రావు అన్నారు. శుక్రవారం పాఠశాలలో రాఖీ పండుగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులు హెచ్ఎంకు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి, తోటి విద్యార్థులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థి దశలోనే మంచి అలవాట్లు అలవర్చుకోవాలన్నారు. శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, అమ్మానాన్నలకు మంచి పేరు తెవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వార్డెన్ గజానంద్, ఎఎన్ఎం విజయ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రవీంద్రభారతి థియేటర్‌లో ప్రదర్శించడం అభినందనీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని, ఆదిలాబాద్ నుంచి మొట్టమొదటిసారిగా షార్ట్ ఫిలీమ్స్ ప్రదర్శించబడటం ఎంతో సంతోషంగా ఉందని డైరెక్టర్ అర్జున్ లింగాల తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంతో మంది ప్రతిభ కలిగిన ఆర్టిస్టులు, కళాకారులు ఆదిలాబాద్‌లో ఉన్నారని, సరైన ప్రోత్సాహం అందిస్తే ఉన్నతస్థాయికి ఎదుగుతారని అన్నారు. తాము తీసిన షార్ట్ ఫిలీమ్స్, మన ఊరి పల్లె యూట్యూబ్ చానెల్ వీడియోస్‌ను హైదరాబాద్‌లోని రవీంద్రభారతి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో ప్రదర్శించడం తమకెంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సంచాలకులు హరికృష్ణతోపాటు, తమకు సహాయ సహకారాలు అందించిన రమేష్, కిషన్, సాయిచరణ్, రత్నాకర్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన చేపట్టడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

11 వేజ్ బోర్డ్ ఏరియర్స్ ఒకేసారి చెల్లించాలి

నవతెలంగాణ-మందమర్రి

11 వేజ్ బోర్డు ఏరియర్స్‌ను ఒకే సారి చెల్లించాలని ఏసీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ఆటంకాలు ఎదురైనా మెరుగైన వేతన ఒప్పందం చేసుకొని మంచి వేతనాలు తీసుకుంటున్నామని, కానీ 23 నెలల ఏరియర్స్ ఇవ్వడంలో సింగరేణి యాజమాన్యం కాలయాపన చేయటం సరికాదన్నారు. గుర్తింపు సంఘం జనరల్ ఎన్నికల్లో లబ్ది పొందడానికి ఎన్నికల ముందు లాభాల వాటా దసరా అడ్వాన్స్ వేజ్ బోర్డు ఏరియర్స్ ఎన్నికల ముందు ఎక్కువ శాతం ఇచ్చినట్టు నటిస్తున్నారని అన్నారు. కార్మిక వర్గం వీరి దుర్మార్గాన్ని ఎండగడుతూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యాజమాన్యం తక్షణమే వేజ్ బోర్డ్ ఏరియర్స్‌ను ఒకేసారి ఇవ్వాలని లాభాల్లో వాట 35 శాత ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శిలు శైలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, అర్జకొండ ఆంజనేయులు, సెంట్రల్ కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు సుదర్శనం, లింగయ్య, వెంకటస్వామి, ఏరియా నాయకులు శ్రీనివాస్, రాజేశం, తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ అన్నారు. ధరల పెరుగుదలను నియంత్రించాలని, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కాగజ్‌నగర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. అటు ధరల పెరుగుదల, ఇటు నిరుద్యోగ సమస్యతో యువత ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు వేయాలని, ధరల పెరుగుదలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం, ఆత్మకూరి సతీష్, సహాయ కార్యదర్శులు దుర్గం రాజ్‌కుమార్, టీకానంద్, శివ, సభ్యులు శ్రీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

రేపటి పద్మశాలి శంఖారావం విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

అన్ని రంగాల్లో వెనుకబడ్డ పద్మశాలీ సమాజం ప్రభుత్వ పథకాల్లో, రాజకీయ వాటాలో వివక్షకు గురవుతోందని హక్కుల కోసం సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బేత రమేష్ అన్నారు. శుక్రవారం పద్మశాలి సంఘం నాయకులు హైదరాబాద్‌లో సెప్టెంబర్ 3న తలపెట్టిన శంఖారావం బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ బీసీ ఆర్థిక చేయూత పథకంలో పద్మశాలి కులాన్ని జాబితాలో చేర్చకపోవడంతో ఆర్థికంగా వెనుకబడ్డ పేద పద్మశాలి కుటుంబాలు స్వయం ఉపాధి రుణాలు పొందలేకపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు ప్రభుత్వం పద్మశాలి కులాన్ని విస్మరిస్తున్నారని అన్నారు. ఎన్నికల్లోను టికెట్లు కేటాయించడంలో వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇల్లు లేని పద్మశాలి కుటుంబాలకు గృహలక్ష్మి కింద ఆర్థిక సాయం అందించి, స్వయం ఉపాధి కింద లక్ష రూపాయలు చొప్పున సాయం చేసి ఆదుకోవాలని కోరారు. సెప్టెంబర్ మూడున హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభకు జిల్లా నలుమూలల నుంచి వేలాది సంఖ్యలో తరలి వెళ్తున్నట్టు తెలిపారు. ఐక్యత చాటేందుకు శంఖారావాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి పల్లె నుంచి పద్మశాలి కులస్తులు తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ జక్కుల సత్యనారాయణ, తాలూకా అధ్యక్షులు బొమ్మకంటి రమేష్, రాష్ట్ర కార్యదర్శి కామన్ విఠల్, నాయకులు మోర ఆశన్న, ఆత్మ కమిటీ చైర్మెన్ జిట్ట రమేష్, చిలుక విలాస్, సీఎం ఉశన్న, దాసరి రమేష్, దాసరి ఆశన్న, కాటన్ ఉశన్న, గాజుల హనుమాండ్లు, మోరకిష్టన్న, హనుమాండ్లు ఈరన్న, బిట్లింగు లక్ష్మణ్, అలిశెట్టి నాగన్న, తుమ్మరాజు పాల్గొన్నారు.

సామాన్యులను విస్మరిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్ రావు
- మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ



నవ తెలంగాణ-దండేపల్లి

కేసీఆర్ తన మాయమాటలతో అమాయక సామాన్య పేద ప్రజలను మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆరోపించారు. శుక్రవారం మండలంలోని తాళ్లపేట, నాగసముద్రం, మాకులపేట గ్రామాలలో ప్రతి యేట కొక్కిరాల రఘుపతిరావు ట్రస్ట్ ద్వారా బతుకమ్మ పండగకి ఆడపడుచుకు కానుకగా ఇచ్చే బతుకమ్మ చీరల పంపిని కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీరలు పంపిణీ చేసి మాట్లాడారు. తాము అధికారంలో ఉన్న లేకున్నా పది సంవత్సరాల పాటు నియోజకవర్గ ఆడపడుచులకు బతుకమ్మ చీరల పంపిణీ చేస్తామని అన్నారు. కేసీఆర్ బతుకమ్మ చీరల పంపిణీ పేరిట నిధులు దోచుకుంటున్నారని నాణ్యతలేని చీరలు పంచుతున్నారని విమర్శించారు. నేత చీరలు పంచుతామని చెప్పి వేరే రాష్ట్రాల నుంచి నాసిరకం చీరలు దిగుమతి చేసుకొని సిరిసిల్ల నేతన్నల పొట్ట కొడుతున్నారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎమ్మెల్యే స్వలాభం కోసం మాత శిశు ఆస్పత్రిని గోదావరి ఒడ్డుకు కట్టి నిధులు వృదా చేశారని ఆరోపించారు. ఆమోదయోగ్యం కానీ స్థలంలో ఆస్పత్రి నిర్మికంచి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. తనకు ఒక అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని వారు ప్రజలను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గడ్డం నాగరాణి త్రిమూర్తి, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, పంచాయతీరాజ్ సంఘటన జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, ఎంపీటీసీలు శ్రీనివాస్, హేమలత, కమలాకర్, సర్పంచ్‌లు ప్రేమల, శంకరయ్య పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో నిరసన


కాగజ్‌నగర్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పెన్షన్ విద్రోహ దినాన్ని పాటించారు. స్థానిక జడ్పీఎస్ఎస్ బాలురు, సర్‌సిల్క్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఓల్డ్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సీపీఎస్ అంతం కోసం తమ సంఘం కృషి చేస్తోందని అన్నారు. అనంతరం తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ అర్బన్ అధ్యక్షులు రతన్‌గైన్, రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షులు పర్శ చంద్రశేఖర్, డి వేణుగోపాల్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు టి రాకేష్, ప్రకాష్, శశికాంత్, జి సంపత్, మండల ఉపాధ్యక్షులు దామోదర్ పాల్గొన్నారు.

జైనూర్ : సీపీఎస్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భూమన్న అన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కలిసి తహసీల్దార్ సమీర్‌హైమద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఒకటి సెప్టెంబర్ 2004న ప్రవేశపెట్టిన కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీంను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1980లో పెన్షన్ రూల్ ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆత్రం దత్తు, జాదవ్ రమేష్, హుస్సేన్, ఉపాధ్యాయ సంఘం నాయకులు పాల్గొన్నారు.

నార్నూర్ : ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మెస్రం శేఖర్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం గాదిగూడ మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని అన్నారు. ఉద్యోగాల విషయంలో ప్రభుత్వాలు మితిమీరిన జోక్యం చేసుకోవడం తగదని అన్నారు. సెప్టెంబర్-1న చీకటి దినంగా ప్రకటించి, నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. నార్నూర్ మండలంలోని జామడ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులు గాదిగూడ మండల ఉపాధ్యాయులు కలిసి సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పున్నరుద్ధరించాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీలకు 12 నెలలు వేతనాలు అందించి వారికి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెస్రం లింగు, జే.తుకారాం, రామారావ్, మెస్రం రామారావ్, కట్టి సంతోష్, ఆత్రం లక్ష్మణ్, పీడీ విశ్వనాథ్, శివాజీ, ప్రేమ్ కుమార్, పుష్పలత, గంగాధర్, హరిచంద్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి డిటికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1 సెప్టెంబర్ 2004 నుండి ప్రారంభించిన సీపీఎస్ (కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్) వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సీపీఎస్‌లో పెట్టిన డబ్బును ప్రభుత్వం షేర్ మార్కెట్లో, వివిధ ఆర్థిక సంస్థలలో పెట్టుబడి పెట్టిందన్నారు. ఆ సంస్థ నష్టపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం కలిగించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. ఫలితంగా పదవీ విరమణ పొందితే కనీస పెన్షన్ రూ.2000 కూడా పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆడే ప్రకాష్, ఏనుగుని బిక్షపతి, పత్తిపాక శ్రావణ్ కుమార్, లకావత్ శంకర్, సత్యనారాయణ, గోవింద్, సంతోష్, లెవిన్ కుమార్, అర్చనదేవి, ప్రతిభ, స్వప్న, చరణ్ సింగ్, వసంత్ కుమార్, జైవంత్, సంతోష్, నరేష్ పాల్గొన్నారు.

కెరమెరి : ఉద్యోగులకు ఓపీఎస్ సాధించడమే ధ్యేయంగా పనిచేస్తామని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకోని నల్ల బ్యాడ్జీలో ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానానికి స్వస్తి పలుకుతూ ఓపీఎస్ సాధించే దిశగా రాష్ట్ర నాయకత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

భీమారం : సీపీఎస్ విదానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తహసీల్దార్ విశ్వంబర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్త పెన్షన్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని కోరుతూ నిరసన చేపట్టామని తెలిపారు. గతంలో అనేక మార్లు సీపీఎస్ రద్దు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు, మంత్రులకు విన్నవించమన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి భీమనాధం మహేష్, మండల నాయకులు విజయ్ కుమార్, సిడాం మల్లయ్యలు పాల్గొన్నారు.


జైనూర్


ఆసిఫాబాద్


భీమారం

సమస్యలు పరిష్కరించకుంటే 11 నుంచి సమ్మె

- నోటీసు అందించిన అంగన్‌వాడీలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈ నెల 11 నుండి సమ్మె చేస్తామని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీఓ సురేఖారెడ్డికి అంగన్‌వాడీలు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్ త్రివేణి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 70 వేల మంది అంగన్‌వాడీ ఉద్యోగులు పని చేస్తున్నారని, వీరంతా బడుగు, బలహీనవర్గాలకు చెందినవారేనని అన్నారు. 45 ఏళ్లకు పైగా పని చేస్తున్నా వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత, ప్రమాద భీమా లేదని అన్నారు. అర్హులైన ఆయాలను టీచర్లుగా ప్రమోట్ చేయాలని, అద్దె భవనాలకు స్వంత భవనాలు నిర్మించాలని, 2017 నుండి పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈనెల 11 నుండి రాష్ట్రవ్యాప్త సమ్మె చేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు



అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల వినోద, వై అరుణ, నాయకులు మీనా, రజిత, లత, ఫాతిమా, విజయలక్ష్మి, అరుణశ్రీ పాల్గొన్నారు.

ఎంపీడీఓ పనితీరుకు నిరసనగా రాస్తారోకో



నవతెలంగాణ-జైనూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద మైనార్టీ ప్రజలకు ఆర్థికంగా బలపర్చడానికి ఇచ్చిన రుణాలలో ఎంపీడీఓ ఇష్టరీతిన వ్యవహరించారని మైనార్టీ యువజన సంఘం నాయకుడు షేక్ ఇబ్రహిం ఆరోపించారు. శుక్రవారం మండలకేంద్రంలోని కుమురం భీం చౌరస్తా వద్ద మైనార్టీలతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రితో పాటు ఆర్థిక శాఖా మంత్రి హరీష్‌రావు మైనార్టీ పేద ప్రజలకు స్వయం ఉపాధి కోసం వంద శాతం రాయితీ రుణాలు అందిస్తున్నారని తెలిపారు. ఇష్టం వచ్చిన వారికి ఒక్కో యూనిట్‌కు కమీషన్ తీసుకుని మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. సర్వే చేసి ఆర్థికంగా వెనుకబడిన వారికి రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం ఇచ్చిన ఉచిత రుణాలను మండల అధికారులు ఇష్టమచ్చిన వారకి ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వంతో పాటు స్థానిక అధికారులు ప్రకటించారు. అందులో భాగంగా సుమారు 600పైగా దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు. అందులో పలు కారణాలతో పలువురి పేర్లు నమోదు కాలేదని, కేవలం 12 మందికే రుణాలు మంజూరైనట్టు ప్రభుత్వం ప్రకటించింది. వచ్చిన 12 రుణాల్లో మండల అభివృద్ధి అధికారి ప్రభుదయ ఇష్టం వచ్చినట్టు వ్యవహరించి ఇచ్చారని ఆరోపించారు. మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్నారని సమాచారం తెలుసుకున్న జడ్పీచైర్‌పర్సన్ కోవలక్ష్మి ఫోన్ చేసి ఆందోళన కారులకు సద్దిచెప్పటంతో ఆందోళన విరమించారు.

సీఆర్‌ఆర్ జ్ఞాపకార్థం ఉత్తమ విద్యార్థులకు అవార్డులు

- సీఆర్‌ఆర్ కాంస్య విగ్రహ ఏర్పాటుకు డిమాండ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ కాంగ్రెస్ దిగ్గజం దివంగత చిలుకూరి రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ప్రతీ సంవత్సరం తన ఫౌండేషన్ తరపున ఉత్తమ విద్యార్థులకు అవార్డులు ప్రధానం చేయనున్నట్టు కాంగ్రెస్ నాయకులు కేఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ కంది శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిలుకూరి రామచంద్రారెడ్డి లాంటి గొప్ప రాజకీయనాయకులు చాలా అరుదుగా ఉంటారన్నారు. అలాంటి నిష్కల్మష నాయకుడిపై సోషల్ మీడియా ద్వారా అనుచిత, అసత్య ప్రచారాలను కంది శ్రీనివాస్‌రెడ్డి ఖండించారు. ఆయన స్ఫూర్తితోనే తను రాజకీయాల్లోకి వచ్చినట్టు తెలిపారు. ఫౌండేషన్ ద్వారా చేసే సేవల కంటే రాజకీయాల ద్వారా మరింత ఎక్కువగా ప్రజాసేవ చేయొచ్చనేది ఆయన్ను చూసే తెలుసుకున్నానని తెలిపారు. చెనాక-కోరట బ్యారేజ్‌కు చిలుకూరి రామచంద్రారెడ్డి పేరు పెట్టాలని,



సీఆర్‌ఆర్ కాంస్య విగ్రహ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో గిమ్మ సంతోష్, భరత్ వాగ్మరే, నాగర్కర్ శంకర్, షకీల్, అల్లూరి అశోక్ రెడ్డి, రాజ్ మొహమ్మద్, మీరా, రవీందర్ రెడ్డి, షేక్ మన్సూర్, ముఖీమ్, అంజద్ ఖాన్, కర్క పోతారాజు సంతోష్, కిష్టారెడ్డి పాల్గొన్నారు.

8న కాగజ్‌నగర్‌లో ధర్నా

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఈ నెల ఎనిమిదో తేదీన కాగజ్‌నగర్‌లో ధర్నా చేపట్టనున్నట్లు బీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి సిడం గణపతి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి అర్షద్‌హుస్సేన్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక రాజీవ్ చౌరస్తా నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి అర్ధాంతరంగా ఆపివేశారని, దీనితో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని అన్నారు. పలుసార్లు ప్రమాదాలు జరిగినా అధికారులు కానీ, ఎమ్మెల్యే కాని పట్టించుకోవడం లేదని అన్నారు. వారి నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ స్థానిక రాజీవ్ చౌక్‌లో చేపట్టే ధర్నా కార్యక్రమానికి బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్టీసీ ఆర్ఎం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలేమాన్, డిప్యూటీ ఆర్ఎం (ఆపరేషన్) ఎస్.ప్రణీత్ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేసి పరిచయం చేసుకున్నారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. ఆర్టీసీ సంస్థ ద్వారా అందిస్తున్న సేవలతో పాటు సంస్థ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను రీజినల్ మేనేజర్ కలెక్టర్‌కు వివరించారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-బేల

మండలంలోని బాది గ్రామంలో శుక్రవారం సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న చిత్రపటాలకు, వికలాంగులు, రైతులు పాలాభిషేకం చేశారు. సీఎం కేసీఆర్ వికలాంగులకు రూ.3016 ఉన్న పెన్షన్‌ను రూ.4016లకు పెంచినందుకు, రైతు రుణమాఫీ చేసినందుకు హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిడాం లక్ష్మిబాయి, ఉపసర్పంచ్ దంతేల వినోద్, గ్రామ బీఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో నా మట్టి నాదేశం కార్యక్రమం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా నా మట్టి నా దేశం అనే కార్యక్రమాన్ని పట్టణంలోని శాంతినగర్ కాలనీలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృతవాటికను నిర్మించడానికి దేశంలో ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరణకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా నేడు ఘనంగా ఈ కార్యక్రమాన్ని ప్రతి మండలంలో ఒక గ్రామంలో ప్రతి ఇంటి నుంచి మట్టి సేకరణ చేయడం ప్రారంభించామని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా ఈ వేళ దేశం కోసం అమరులైన వీరులను స్మరించుకుంటూ బీజేపీ జాతీయ స్థాయిలో నా మట్టి నా దేశం అనే కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, విజయ్, ఆదినాథ్, మయూర్ చంద్ర, జోగు రవి, మహేందర్, సోమ రవి, ధోని జ్యోతి, భీం సేనరెడ్డి, వేదవ్యాస్, దయాకర్, రాము, శ్రీనివాస్, గోపీ, సూర్య కిరన్, నాగేష్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప ధర్మప్రచార సభ సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) జిల్లా సర్వసభ్య సమావేశాన్ని శనివారం కాగజ్‌నగర్ న్యూ కాలనీలోని అయ్యప్ప ఆలయంలో నిర్వహించనున్నట్లు ప్రచార సభ జిల్లా అధ్యక్షులు పోతురాజుల రమేష్, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి తులసీదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ముఖ్య అతిథులుగా ఏబీఏపీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కన్వీనర్ రాచర్ల రమేష్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేతి తిరుమల్‌రావు, ప్రధాన కార్యదర్శి పుల్లం రాజు, కోశాధికారి గంగాధర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎనగంటి భిక్షపతి హాజరు కానున్నట్లు తెలిపారు. ఏబీఏపీ భవిష్యత్తు ప్రణాళికపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.